"మరి ఎవరనుకొన్నావే?"

"ఏమి అనుకోలేదుగాని ఐదు నిమిషాలు వుండవె, కథ మంచి పట్టులో వుంది"

"సరెలే చదువుకో, ఈలోగా అత్తయ్యను పలుకరించి వస్తాను"

కథ ముగించి వంట గదిలోకి వెళ్లాను. ఉష అమ్మ ఇచ్చిన కాఫీ తాగుతోం. మా మామయ్య మేము ఒకే ఊర్లో వుండటం వల్ల నేను- అదీ చిన్నతనం నుండి ఏ అరమరికలు లేకుండా పెరిగాము మా మధ్య బంధుత్వం కన్నా స్నేహ బంధమే ఎక్కువ. అమ్మవైపు చూసి అడిగాను. "అమ్మా! నేనేమైనా చెయ్యాలా" అని.

"చాల్లేవే గొప్ప ఇందాక పిలిచినప్పుడు వచ్చేవు గన కనా, పని నీ కోసం కూర్చోటానికి. ఉష వచ్చింది కదా వెళ్లు కాసేపు కబుర్లు చెప్పు" అమ్మ నవ్వుతూ అంది.

"గిరిజా ఏమిటే కథ మంచి రసపట్టులో వుండగా వచ్చినట్లున్నాను. ఎవరే ఆ రైటర్?"

"శ్రీధర్‌గారని మంచి రైటర్ ఎక్కడా, అతుకులు ఆడంబరాలు వుండవు. ప్రతీ మనిషి మనస్సునీ అద్దంలో చూసినట్లు పాత్రలో పరకాయ ప్రవేశం చేసినట్లు అద్భుతంగా వుంటుందే అతని శైలి"

"సరేలేవే ఆ విషయం చాలా సార్లు చెప్పావుగాని, నీలా పుస్తకాల పురుగు అన్న బిరుదు నాకు లేదులే...ఇంకేమైనా కబుర్లుంటే చెప్పవే"

ఓ గంట తరువాత ఉష వెళ్తానంటూ లేచింది. "అబ్బా వుండవే తల్లి నీకో విషయం చెప్పటం మరచిపోయాను. ఈ రైటర్‌గారి అడ్రస్ తెలిసిందే. ఈరోజుగాని, రేపుగాని రైటర్‌గారు ఏ సమయంలో ఇంట్లో ఉంటారో తెలుసుకోవాలి కదా, ఫోను చేసి చెబుతాను తప్పకుండా రావాలి సుమా" అన్నాను. ఉష బై చెప్పి వెళ్లిపోయింది.

* * *

మరుసటి రోజు ఉషకు ఫోను చేసి చెప్పాను మధ్యాహ్నం 3, 4 గంటల మధ్య రైటర్‌గారి ఇంటికి వెళదాం- ఆ టైముకి నీవు తప్పక రావాలి అని.

హాలులో కూర్చొని చదువుకొంటున్న తమ్ముడు, అక్కా! ఎక్కడికే బొమ్మరిల్లు సినిమాకు ఐతే నేను వస్తానే అన్నాడు.

విషయం చెప్పి మా ఇద్దరికీ తోడుగా వాడిని కూడా రమ్మని పిలిచాను వాడు నాకన్నా 4 సంవత్సరాలు చిన్న వాడు.

అనుకొన్న టైముకి ఉష కూడా వచ్చింది. అమ్మతో చెప్పి ముగ్గురం బయలుదేరాము. ఆటోదిగి గేటుతీసి లోపలికి అడుగుపెట్టాము. ఇంతలో డోరు తీసుకొని ఓ మధ్య వయస్కుడు కళ్లు కాస్త పెద్దవి చేసి, కళ్లద్దాలు సర్దుకొంటూ ఎవరూ - ఎవరు కావాలి అంటూ అడిగాడు.

"రైటర్ శ్రీధర్‌గారండి"

"ఓ ఫోను చేసింది మీరేనా? ఆ శ్రీధర్‌ని నేనే" అంటూ ప్రక్కకు తొలగి మమ్మల్ని లోపలికి ఆహ్వానించాడు. గదంతా కలయచూస్తూ అతను కూర్చోమని చెప్పగానే ముగ్గురం సోఫాలో కూర్చున్నాము. అతను కూడా మేము అడిగిన వాటికి సమాధానం చెబుతూ కూర్చున్నాడు.

# అభిమాని

నా అభిమాన రైటర్స్ గురించి చెప్పి ఇన్నాళ్లుగా అన్వేషిస్తే ఇప్పటికి మీ ఒక్కరి అడ్రస్ మాత్రం దొరికిందండి అన్నాను. తను ఎన్నాళ్లుగా రచనలు సాగిస్తుంది ఎన్నెన్ని కథలు ఏ ఏ పత్రికలలో ప్రచురించబడ్డాయో, తనకు ఎంతమంది అభిమానులు వున్నారో ఎన్ని కథలకు బహుమతులు వచ్చాయో, ఇలా చెబుతుంటే కళ్లప్పగించి వినటం మా వంతు అయింది.

ఇంతలో వీధిలో నుండి ఓ దీనాతి దీనమైన కంఠం వినిపించింది "బాబూ.. ధర్మం చేయండి నాయనా కడుపుమాడిపోతోంది. పొద్దుటేల నుండి పిడికెడు మెతుకులు లేవు. పిల్లాడి కళ్లు తిరిగి పోతున్నాయి. ధరమ పెభువులు. తండ్రీ ఒక్క రూపాయి ఇప్పించేరంటే చాలు" అంటూ మా ముగ్గురి కళ్లు వీధివైపు తిరిగాయి. చంకలో రెండేళ్ల పిల్లాడితో, ఓ బక్కచిక్కిన స్త్రీ దీనంగా చేయిచాచి నిల్చుంది.

అంతసేపు మాతో మామూలుగా మాట్లాడుతున్న రైటర్‌గారు ఒక్కసారిగా అటు తిరిగి "ఏయ్! పోవే-పో-పో-పోతావా లేదా - చెబుతుంటే నీక్కాదా, పోవె-పో-దొంగ రాస్కెల్" అంటూ అరిచాడు.

మరుక్షణం అదే గొంతుతో మొహాన్ని అష్టవంకర్లు త్రిప్పి లోపలి గదిలోకి చూస్తూ "ఏయ్! ఎక్కడ చచ్చావే మొద్దు పీనుగా, వచ్చి ఈ కప్పు తీయవే" అంటూ గావు కేక పెట్టాడు. అంతసేపు చలనంలేని బొమ్మల్లా కూర్చొన్న మేము ఒక్కసారిగా అదిరిపోయి సోఫాలో నుండి దిగ్గున లేచాము. ఉష నా చేయి ఎప్పుడు పట్టుకుందో తెలియదు ముగ్గురం ఒక్క ఉదుటున అక్కడి నుండి బైటపడ్డాము వెనుకనుండి అతను పిలుస్తున్నా వినిపించనట్లు, వెనక్కి చూడకుండా.

"అక్కా! చూసావా మీ రైటర్‌గారి గొప్పతనం. అతని రాతలకు చేతలకూ వున్న తేడా. నీ ఫేవరెట్ రైటర్స్ ఇంకా చాలామందే వున్నారనుకొంటాను, వాళ్ల అడ్రసులు కూడా తెలుసుకోవె, వాళ్లను కూడా చూసి వద్దాము" తమ్ముడు నా వైపు చూస్తూ నవ్వుతున్నాడు.

నా మనస్సు మౌనంగా వుంది. మా అడుగులు ఇంటివైపు భారంగా పడుతున్నాయి.

"గిరిజా! ఏమిటే అంత మూడీగా వున్నావు. టేకిట్ ఈజీ. మామూలుగా వుండవె" ఉష నా చేయి వదలకుండానే అంటుంది.

నా మనస్సు అనేక విధాలుగా ఆలోచిస్తోంది. మనిషిగా కనీస మానవత్వం కూడా లేని ఇతన్నా ఇంతకాలంగా నేను అభిమానించింది? దీనులపట్ల కాస్తంత దయ జాలి కరుణ గోరంత కూడా లేని ఇతనిపట్ల నేనింత అభిమానం పెంచుకుంది? అరె ఇంట్లో ఆడవాళ్ల పట్ల కూడా కనీస సంస్కారాన్ని పాటించాలన్న జ్ఞానం కూడా లేదే? ఆశ్చర్యంగా వుంది.

అంతలోనే 'ఏయ్ అమ్మాయ్! నువ్వెంత నీ వయస్సెంత నీవు చదివేది వాళ్ల సాహిత్యాన్నా, వాళ్ల వ్యక్తిత్వాలనా వాళ్ల గుణగణాలతో నీకేం పని. నూటికో కోటికో ఏ ఒక్కరిలోనో ఏదో చిన్న లోపం వుంటె దానిని అందరికి వర్తింపచేస్తావా?' నా మనస్సు నన్నే సీరియస్‌గా కసురుకొంది.

-ఎం.సరోజిని
(విశాఖపట్నం)




